నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 25 జూలై 2024 | KHAMMAM

బేషరతుగా రుణమాఫీ చేయాలి

- ఏజెన్సీ ప్రాంత రైతులకు కొర్రీలు పెట్టొద్దు
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా

చండ్రుగొండ గిర్దావర్ అక్బర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

చండ్రుగొండ, జూలై 24: రైతులందరికీ బేషరతుగా పంట రుణాలు మాఫీ చేయాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత రైతులకు ఎలాంటి కొర్రీలూ పెట్టొద్దని స్పష్టం చేశారు. భద్రాద్రి జిల్లా చండ్రుగొండ మండలంలో రుణమాఫీ కాని రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సహకార సంఘాల్లో, బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టాదారు పాస్‌బుక్‌తోనేగాక పహాణీలతో తీసుకున్న పంట రుణాలను కూడా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పట్టాబుక్కులు, రేషన్‌కార్డులు లేవనే సాకుతో రుణమాఫీ చేయకుండా రైతులకు అన్యాయం చేయడం సరికాదని స్పష్టంచేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు పహాణీలతోనే పంట రుణాలు తీసుకున్నందున వారందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతుభరోసాను కూడా వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం గిర్దావర్ అక్బర్‌కు వినతిపత్రం సమర్పించారు. గుంపెన సొసైటీ వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, డైరెక్టర్ ఉన్నం నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు మేడా మోహన్‌రావు, మద్దిరాల చిన్నిపిచ్చయ్య, మల్లెం వెంకటేశ్వర్లు, నరుకుళ్ల అప్పాజీ, పాండ్ల అంజన్‌రావు, శ్రీను, రైతులు పాల్గొన్నారు.

మధిర : కేక్ కట్ చేసి కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్

దమ్మపేటలోని బంజారా కాలనీలో మొక్కను నాటిన మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

ఇల్లెందు రూరల్ : తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేస్తున్న యువకులు

ఖమ్మం : ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు నాగరాజు

వెయ్యేళ్లు వర్ధిల్లు రామన్నా..

- ఊరూరా ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు
- ఖమ్మం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు
- కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టిన బీఆర్ఎస్ శ్రేణులు
- మొక్కలు నాటి, రోగులు, వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన వేడుకలను ఖమ్మం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఊరూరా కేట్ కట్ చేసి.. స్వీట్లు పంపిణీ చేశారు. పండుగ వాతావరణంలో మొక్కలు నాటడం.. ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో రోగులకు, అనాథాశ్రమాల్లో వృద్ధులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనాథలకు దుస్తులు అందజేశారు. రక్తదానం చేశారు. ప్రజలతో మమేకమై.. నిత్యం సమస్యలపై ప్రశ్నించే యువనేత కేటీఆర్ అని, రాష్ట్రంలో ఐటీ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత సాధించారని, ఆయన వెయ్యేళ్లు వర్ధిల్లాలని పలువురు నాయకులు ఆశీస్సులు, దీవెనలు అందజేశారు. మధిరలో ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, దమ్మపేటలో అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఖమ్మంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు తదితరులు బర్త్ డే వేడుకల్లో పాల్గొన్నారు. – నెట్‌వర్క్

రుణ ప్రణాళిక జాడేది?

- పంటల సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా ఊసేలేదు
- అటు రైతుబంధు రాక.. ఇటు పంట రుణాలు లేక ఇక్కట్లు
- చివరికి వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న జిల్లా రైతులు



ఖమ్మం, జూలై 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పంటల సీజన్ ప్రారంభమై రెండు నెలలైనా జిల్లాలో రుణ ప్రణాళిక జాడలేకుండా పోయింది. ఇప్పటికే రావాల్సిన రైతుబంధు పంటల సాయం రాకపోవడం, ఇటు బ్యాంకుల నుంచి పంట రుణాలు అందకపోవడం వంటి కారణాలతో అన్నదాతలు అరిగోస పడుతున్నారు. చివరికి అధిక వడ్డీ అయినప్పటికీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ ఇక్కట్లు పడుతున్నారు. సాధారణంగా వ్యవసాయ సీజన్‌కు ముందుగా జిల్లా యంత్రాంగం జిల్లాస్థాయి బ్యాంకర్లతో కలిసి పంట రుణాల ప్రణాళిక తయారు చేస్తుంటుంది. దానికి అనుగుణంగా బ్యాంకులన్నీ రైతులకు పంట రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ సంవత్సరం వానకాలం సీజన్ ప్రారంభమై దాదాపు రెండు నెలలవుతోంది. కానీ.. ఇప్పటివరకూ లీడ్ బ్యాంక్ అధికారులు పంట రుణ ప్రణాళికను ప్రకటించలేదు. దీంతో అదునులో ఉన్న అన్నదాతలకు పంట రుణాలు అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నాయి. ఏటా వానకాలం సీజన్‌కు ముందు ఆ సంవత్సరంలోని వానకాలం, యాసంగి పంటలకు ఏయే బ్యాంకులు ఎంతమేర పంట రుణాలు, ఎంతమంది రైతులకు ఇవ్వబోతున్నాయో అనే వివరాలను జిల్లా అధికారులు సేకరిస్తారు. అందుకు అనుగుణంగా లీడ్ బ్యాంకు అధికారులతో కలిసి ప్రణాళికను సిద్ధం చేస్తారు. కానీ.. ఈ ఏడాది ఆ ప్రక్రియ ఇంతవరకూ మొదలుకాలేదు.

3 లక్షల ఎకరాల్లో పంటల సాగు

నిరుటి వానకాలం, యాసంగి సీజన్లలో జిల్లాలో ఆశించిన మేర వర్షపాతం నమోదు కాలేదు. దీంతో ఆశించిన మేర పంటల సాగు జరగలేదు. ఈ సీజన్ ఆరంభంలోనూ ఆశించిన మేర వర్షపాతం నమోదు కాకపోయినప్పటికీ జూలై ఆరంభం నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఈ సీజన్‌లోనైనా సాగు సమృద్ధిగా జరగాలనే ఉద్దేశంతో రైతులందరూ సాగు పనుల్లో నిమగ్నమై ఉన్నారు. అందుకు అనుగుణంగానే ఇప్పటికే జిల్లాలో రికార్డు స్థాయిలో 3 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ప్రధాన పంటలుగా 1.85 లక్షల ఎకరాల్లో పత్తి, 60 వేల ఎకరాల్లో వరి సాగవుతున్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో మిగతా పంటలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో సాగర్ ఆయకట్టులోనూ వరిసాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సాగు పనులు ఇంత జోరుగా ఉన్నప్పటికీ పంటల పెట్టుబడి విషయంలో ప్రభుతం నుంచి స్పందన కరువైంది. ఒకవైపు ఇంత వరకూ రైతుభరోసా సాయాన్ని ఇవ్వకపోవడం, మరోవైపు బ్యాంకుల నుంచి పంటల రుణాలనూ అందించకపోవడం వంటి కారణాలతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

రైతుబంధు రాక.. పంట రుణాలు లేక

సీజన్‌కు రూ.5 వేల చొప్పున రెండు సీజన్లకు కలిపి ఎకరానికి రూ.10 వేలను గత కేసీఆర్ ప్రభుత్వం గడిచిన 11 దఫాలుగా అందిస్తూ వచ్చింది. సీజన్‌కు ముందుగానే ఆ సీజన్ పంటల పెట్టుబడి సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేది. కానీ.. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. సీజన్‌కు రూ.7,500 చొప్పున ఎకరానికి రూ.15 వేలను రైతు భరోసా పేరిట ఇస్తానంటూ హామీ ఇచ్చింది. కానీ.. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా, వానకాలం పంటల సీజన్ మొదలై రెండు నెలలు గడుస్తున్నా రైతు భరోసాను అందించిన పాపాన పోలేదు. మరోవైపు రుణ ప్రణాళిక ప్రకటించి బ్యాంకుల నుంచి రుణాలనూ అందించడం లేదు. దీంతో రైతుబంధు రాక, పంట రుణాలు అందక అన్నదాతల వేదన అరణ్యరోదనగానే మిగిలిపోతోంది. ఇంకోవైపు పంట రుణాల కోసం బ్యాంకుల వద్దకు వెళ్లిన రైతులకు.. బ్యాంకు అధికారులు రుణమాఫీ లింకు పెడుతున్నారు. రుణమాఫీ విషయం తేలాకే చూద్దామంటూ తిప్పి పంపిస్తున్నారు.

వారం రోజుల్లో ప్రకటిస్తాం..

పంటల రుణ ప్రణాళిక వివరాలను వారం రోజుల్లోపు ప్రకటిస్తాం. కొద్దిరోజుల క్రితం డిస్ట్రిక్ట్ క్రెడిట్ ప్లాన్(డీసీపీ) సమావేశం జరగాల్సి ఉంది. కానీ.. అనివార్య కారణాల వల్ల నిర్వహించలేకపోయాం. ఇప్పటికే బ్యాంకుల ద్వారా వివరాలు సేకరించాం. వారం రోజుల్లో పూర్తి నివేదికతో జిల్లా రుణ ప్రణాళికను కలెక్టర్ విడుదల చేస్తారు. తద్వారా రైతులకు త్వరితగతిన రుణాలు అందేలా చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాసరెడ్డి, ఖమ్మం జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్

కొత్త చట్టాలకు సవరణ చేయాలి

కేంద్ర న్యాయ శాఖ మంత్రికి ఎంపీ వద్దిరాజు వినతి


కేంద్ర న్యాయ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం/ ఖమ్మం లీగల్, జూలై 24: కొత్తగా తెచ్చిన నేర చట్టాలను ఒకసారి సమీక్షించి స్వల్ప సవరణలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర నేతృత్వంలో ఖమ్మంకు చెందిన సీనియర్ న్యాయవాది తాళ్లూరి దిలీప్ చౌదరి ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌ను ఢిల్లీలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ నోటరీల నియామకాలను వెంటనే చేపట్టాలని, అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్లును అమలు చేయాలని వినతిలో పేర్కొన్నారు. సెంట్రల్ నోటరీస్ నోటిఫికేషన్ 2021లో వేయగా.. 2 వేల మంది న్యాయవాదులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి నియామకాలు చేపట్టాలని మంత్రి దృష్టికి తెచ్చారు. చట్టాల సవరణల విషయంలో జిల్లా జడ్జిలు, జిల్లా కోర్టుల ప్రాక్టీసింగ్ సీనియర్ న్యాయవాదుల సూచనలు స్వీకరిస్తే బాగుంటుందని, ఇందుకోసం సదస్సులు, సమావేశాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఎంపీ రవిచంద్ర, న్యాయవాదులు దిలీప్‌చౌదరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది సంక్రాంతి రాజశేఖర్ తదితరులు మంత్రికి వివరించారు. వీటన్నింటినీ శ్రద్ధగా విన్న మంత్రి తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

- 'అమ్మ ఆదర్శ స్కూళ్ల'లో మిగిలిన వర్కులు ఆగస్టు చివరికి ముగించాలి
- పనుల పురోగతిపై అధికారుల సమీక్షలో ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్

అధికారులతో సమీక్షిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, జూలై 24: జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మిగులు పనులను ఆగస్టు చివరి వరకు పూర్తి చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ ఆధికారులను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 955 పాఠశాలల్లో పనులను ప్రారంభించామని, ఇప్పటి వరకు 508 పాఠశాలల్లో మాత్రమే పూర్తి చేయాగలిగామని అన్నారు. మరో 447 పాఠశాలల్లో పనులు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. వాటిని వెంటనే పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న 73 పనులు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. మిగిలిన పనులను ఆయా ఇంజినీరింగ్ విభాగాల అధికారులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తి చేసిన వెంటనే ఎంబీ రికార్డు చేసి చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, డీఆర్‌డీవో సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు సోమశేఖరశర్మ, హేమలత, వెంకటరెడ్డి, వేణు, శ్రీరాంకోటి నాయక్, కృష్ణలాల్, రాజు పాల్గొన్నారు.

పెరగట్లే.. తగ్గట్లే!

- పది రోజులుగా ఏసీ మిర్చి క్వింటాల్ రూ.19,300
- ఖమ్మం మార్కెట్ చరిత్రలో ఇదే తొలిసారి
- అమ్ముకోవాలా.. వద్దా.. అని రైతుల అయోమయం

మిర్చియార్డుకు రైతులు తీసుకొచ్చిన బస్తాలు (ఫైల్)

ఖమ్మం వ్యవసాయం, జూలై 24 : స్టాక్ మార్కెట్‌లో షేర్ల ధరలు ఎలా ఉంటాయో.. తేజా రకం మిర్చి ధరల పరిస్థితి కూడా ఇంచుమించు అదే తరహాలో కొనసాగుతోంది. అంటే ప్రతి రోజు ధర తగ్గొచ్చు లేదా పెరగవచ్చు. సీజన్‌లో మిర్చి పంటకు పలికిన ధరకంటే ఏసీలో నిల్వ ఉంచిన పంటకు ధర పెరగడం సర్వసాధారణం. కానీ.. ఈ ఏడాది ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. గత సంవత్సరం మార్కెట్‌కు పంట బాగా రాకపోవడంతో క్వింటాల్ రూ.22 వేల వరకు గరిష్ట ధర పలికింది. దీంతో ధర మరింత పెరగవచ్చనే ఉద్దేశంతో రైతులతోపాటు కొందరు ఖరీదుదారులు పంటను కోల్డ్ స్టోరేజ్‌ల్లో నిల్వ చేసుకున్నారు. అయితే పక్షం రోజులుగా పైసా తేడా లేకుండా జెండాపాటలో ఒకే ధర పలుకుతుండడం పట్ల రైతులు, అడ్డీ వ్యాపారులు ఆందోళనతో పాటు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిరోజూ జెండాపాటలో అదే ధర

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఆది నుంచి అపరాలు, పత్తి, మిర్చి క్రయ విక్రయాలకు సంబంధించి జెండాపాట ద్వారా గరిష్ట ధర నిర్ణయం జరుగుతుంది. ఈ–నామ్ అమల్లోకి వచ్చిన తర్వాత పత్తి, అపరాలు మినహా మిర్చి క్రయ విక్రయాల్లో మాత్రమే జెండాపాట పాడుతున్నారు. ఖరీదుదారుల్లో పోటీతత్వం తీసుకురావాలనే ఉద్దేశంతో జెండాపాట నిత్యం ఉదయం 7: 30 గంటలకే నిర్వహిస్తారు. అయితే ఈ నెల 10 నుంచి 24వ తేదీ వరకు వరుసగా జెండాపాటలో తేజా రకం ఏసీ మిర్చి పంటకు క్వింటాల్ గరిష్ట ధర రూ.19,300 మాత్రమే పలుకుతున్నది. దీంతో అటు రైతులు, కార్మికులు, అడ్డీ వ్యాపారులు సైతం నివ్వెరపోతున్నారు. జెండాపాటలో చాలామంది ఖరీదుదారులు పాల్గొంటున్నారు. పోటాపోటీగా పాట నడుస్తున్నప్పటికీ చివరకు రూ.19,300 వరకు వచ్చి ఆగిపోతున్నది. కరెక్టుగా అక్కడే ఎందుకు పాట ఆగుతుంది అర్థంకాని పరిస్థితి. పైగా ఎగుమతులు లేకపోవడం, జాతీయ మార్కెట్‌లో సైతం డిమాండ్ లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో గరిష్ట ధర తగ్గకుండా కాపాడుతున్నామని చెబుతున్నారు. ఇతర మార్కెట్‌లో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ ఖమ్మం మార్కెట్లో కూడబలుక్కొని జెండాపాట దాటకుండా చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా ఏసీ రకం మిర్చిపంటకు ధర పెరగకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కోల్డ్ స్టోరేజ్‌లో పంటను మరింత కాలం నిల్వ ఉంచుకోవాలా.. అమ్ముకోవాలా.. తెలియక అయోమయంలో ఉన్నారు.

ధరల పట్టికలొచ్చాయ్..

- 'ఆధార్ సెంటర్'లో బోర్డుల ఏర్పాటు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన
- సేవలకు వసూళ్లు మాత్రం యథావిధిగానే..

ఏయే సేవలకు ఎంతెంత రుసుములో తెలుపుతూ ఏర్పాటు చేసిన పట్టిక

రఘునాథపాలెం, జూలై 24 : ఆధార్ సెంటర్‌లో ధరల పట్టిక ఏర్పాటైంది. 'ఆధార్ సెంటర్లలో అడ్డగోలు దోపిడీ' పేరుతో ఈ నెల 17న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో నగరంలోని వీడీవోస్ కాలనీ ఆధార్ సెంటర్‌లో ధరల పట్టికను అమర్చారు. అయితే బోర్డు ఇంగ్లిష్‌లో ఉండడంతో తమకు అర్థం కావడం లేదని సేవల నిమిత్తం వచ్చే పలువురు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. దీంతో నిర్వాహకుల తీరులో ఏమాత్రం మార్పు రాలేదు. ఉచితంగా నిర్వహించాల్సిన ఆధార్ ఎన్‌రోల్‌మెంట్‌కూ రూ.100 వసూలు చేయడం కనిపించింది. అంతేకాక సేవల నిర్వహణ తర్వాత వినియోగదారుడికి ఇచ్చే ప్రింట్‌లో రూ.50 ఉంటే.. రూ.వంద తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అధిక వసూళ్లపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

పెద్దాసుపత్రికి క్రిటికల్ కేర్ యూనిట్

- ఎన్‌హెచ్ఎం నుంచి రూ.23 కోట్ల నిధులు మంజూరు
- కలెక్టర్ ఆమోదం.. పది రోజుల్లో పనులు ప్రారంభం..

ఖమ్మం సిటీ, జూలై 24: జిల్లా సార్వజనీన ఆసుపత్రికి మరో అరుదైన ఘనత దక్కబోతున్నది. జాతీయ హెల్త్ మిషన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేసింది. ప్రజలకు అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో జిల్లా అధికారులు; ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల, పెద్దాసుపత్రికి చెందిన వైద్యాధికారులు పంపిన ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. దీనిలో భాగంగా 50 బెడ్లతో అధునాతన క్యాజువాలిటీ, ఐసీయూ, ఈఎంసీ వార్డులు, గదులతో కూడిన ప్రత్యేక భవన నిర్మాణం నిమిత్తం రూ.23 కోట్ల గ్రాంట్ విడుదలకు ఆమోద ముద్ర వేసింది. దవాఖానలోని ట్రామాకేర్ సెంటర్ ఎదురుగా పాత భవనాలను తొలగించి జీ ప్లస్ టూ భవంతిని నిర్మించనున్నారు. ఇందుకు ఖమ్మం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సైతం ఆమోదం తెలిపారు. మరో పది లేదా పదిహేను రోజుల్లో పనులు ప్రారంభించే విధంగా వైద్యాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, జిల్లా సార్వజనీన ఆసుపత్రికి క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు కావడం పట్ల సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. అదనపు వైద్యులు, సిబ్బంది నియమితులవుతారని చెప్పారు. తొందరలోనే జిల్లా కేంద్రమైన ఖమ్మంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు కార్పొరేట్‌స్థాయిలో ఎమర్జెన్సీ సేవలు అందించనున్నామని వివరించారు.